## క్లుప్తంగా

### కొత్త బస్టాండ్‌లో కర్టసీ డే



కీ చైన్లు అందజేస్తున్న డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య

**ఖమ్మంమయూరిసెంటర్:** టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో కర్టసీ డే నిర్వహించారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్ మల్లయ్య ప్రయాణికులకు గులాబీ పువ్వు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీజీఎస్ఆర్టీసీ లోగో, టీజీఎస్ ఆర్టీసీ యాప్, క్యూ ఆర్ కోడ్ ఉన్న కీ చైన్లను బహుమతిగా అందజేశారు. డిపో మేనేజర్ పి.దినేష్‌కుమార్, బస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఖమ్మంవ్యవసాయం:** నగరంలోని 11 కేవీ మైసమ్మ గుడి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు వీఆర్‌కే సిల్క్స్ వెనుక, వరదయ్యనగర్, మమత హాస్పిటల్ రోడ్, ట్యాంక్ బండ్ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏడీఈ ఎం.యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నగరంలోని బురహాన్‌పురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న మైక్రోవేవ్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మజ్దూర్ కాలనీ, బస్‌డిపో రోడ్, మయూరిసెంటర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ రవికుమార్ తెలిపారు.

**కామేపల్లి:** కొత్తలింగాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం కొత్తలింగాల, పండితాపురం, పాతలింగాల, గోవింద్రాల, నెమలిపురి, పింజరమడుగు గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

**రఘునాథపాలెం:** మండలకేంద్రమైన రఘునాథపాలెం విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్‌లైన్ మరమ్మతు దృష్ట్యా శనివారం రఘునాథపాలెం, జింకలతండా, పారిశ్రామిక ప్రాంతం, కోయచలక, కోల్డ్‌స్టోరి తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

### నేడు 'భూ భారతి' పై అవగాహన సదస్సు

**తిరుమలాయపాలెం:** భూభారతి చట్టంపై శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కదిలింది.. కరుణ రథం..

**భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే**
- ప్రత్యేక ప్రార్థనలు.. శాంతి ర్యాలీలు
- శిలువయాత్ర ప్రదర్శనలు

ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజైన గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక పార్థనలు, వీధుల్లో శాంతి ర్యాలీలు చేశారు. యాత్రలో ఏసుకు శిలువ వేసిన ఘట్టాల్ని ప్రదర్శించారు. ఫాదర్లు బైబిల్ సందేశాన్ని తెలిపారు. ఏసు చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం అర్బన్: శిలువ యాత్ర ఘటాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు



నేలకొండపల్లి: చెరువుమాధారంలో..



రఘునాథపాలెంలో..



ఖమ్మం గాంధీచౌక్: శిలువ యాత్ర..



ఖమ్మంరూరల్: ప్రసంగిస్తున్న బిషప్ సగిలి ప్రకాష్



కామేపల్లిలో..



తిరుమలాయపాలెంలో..

## కేఎంసీ సమాచారం..

### సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మేయర్



ఏఈఈకి సూచనలు చేస్తున్న మేయర్ నీరజ

**ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలోని 30వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ...రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడం జరిగిందని, నగర అభివృద్ధి, రవాణ సౌకర్యానికి రోడ్లను విస్తరించుకోవడం, ఆధునీకరించడం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యర్రా గోపి, ఏఈఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

**నగరంలో పర్యటిస్తున్న ఓడీఎఫ్, జీఎఫ్‌సీ బృందాలు..**

నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించడంతో పాటు బహిరంగ మలమూత్ర విసర్జన రహితం, వ్యర్థాల కుప్పలు రహిత ప్రాంతాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలు ఖమ్మంలో పర్యటిస్తున్నారు. ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్, జీఎఫ్‌సీ బృందాలు నగరంలో పర్యటించి నగరానికి మార్కులు ఇవ్వనున్నారు. ఇప్పటికే ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ బృందం నగరంలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశీలించినట్లు తెలిసింది.

## సెల్ఫ్ అసెస్‌మెంట్లపై ఆరా..

- పెడ్లకు ఇంటి నంబర్లు కేటాయించినట్లు గుర్తింపు
- ఆర్ఐలు తిరస్కరించిన ఫైళ్లకూ అనుమతి

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం నగర పాలక సంస్థ ఆదాయం పెంచడంలో భాగంగా నిర్మాణాలకు పన్నులు విధించడం రెవెన్యూ విభాగం ఉద్యోగుల విధి. కానీ నూతన నిర్మాణాలకు అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించి ఆస్తి పన్ను విధించడంలో కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో వచ్చిన ఆరోపణలపై వరంగల్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయ విజిలెన్స్ అధికారులు నివేదిక కోరారు. ఇదే అంశంపై ఇటీవల విమర్శలు రావడంతో కేఎంసీ అధికారులు సైతం ఆరా తీస్తున్నారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ల దరఖాస్తులు, ఇంటి నంబర్ల కేటాయింపు ఆధారంగా పరిశీలించడంతో ఇంటి నంబర్ల కేటాయింపులో అవకతవకలు నిజమేనని గుర్తించినట్లు సమాచారం

**తొలగించిన సిబ్బందితో కలిసి..**

ఇంటి నంబర్ల కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో గతంలో ఒకరిద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించారు. అయితే వారితో కలిసి కొందరు ఉద్యోగులు నంబర్ల కేటాయింపు, పన్ను విధింపులో అక్రమాలకు పాల్పడుతున్నారని సమాచారం. కొందరి సెల్ఫ్ అసెస్‌మెంట్ దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు కేఎంసీ సమీపాన సెంటర్ తెరిపించారని తెలిసింది. బిల్ కలెక్టర్లు, ఆర్ఐలు క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తులను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న తిరస్కరించినా ఆపై అధికారి, ఉన్నతాధికారుల వద్ద ఉండే కంప్యూటర్ ఆపరేటర్లు నంబర్లు కేటాయించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కేఎంసీ అధికారుల విచారణ చేపట్టడంతో పాటు వరంగల్ విజిలెన్స్ అధికారులు నివేదిక కోరిన నేపథ్యాన విమర్శలు వచ్చిన దరఖాస్తులే కాక అన్నింటినీ పరిశీలించినట్లు తెలిసింది. దీంతో ఖమ్మం వైఎస్సార్‌నగర్ ప్రాంతంలోని 6 వేల గజాల స్థలానికి గాను 200 గజాలలోపు షెడ్ వేయగా, రెవెన్యూ విభాగం అధికారులు ఖాళీ స్థలానికి పన్ను వేయకుండా షెడ్‌కు ఇంటి నంబర్ కేటాయించి పన్ను ఖరారు చేసినట్లు తేలింది. ఈ దరఖాస్తును ఆర్ఐలు తిరస్కరించినా పైస్థాయి ఉద్యోగి, ఆపరేటర్లు అనుమతి వచ్చేలా ఫైల్‌ను డీమ్డ్ చేసినట్లు చెబుతున్నారు. ఇందులో ముగ్గురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాత్ర కీలకంగా ఉందని తేలగా, మొత్తం ఆరోపణలపై కేఎంసీలోని ఓ ఉన్నతాధికారి విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై నివేదిక సిద్ధం చేయగా, రెండు రోజుల్లో కమిషనర్‌కు సమర్పించాక కొందరిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. ఈ అంశంపై కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌ను వివరణ కోరగా సెల్ఫ్ అసెస్‌మెంట్ల ద్వారా నంబర్లు కేటాయింపు ఫిర్యాదులపై విచారణ పూర్తికాగానే కమిషనర్ నివేదికను అందజేస్తామన్నారు.

## ఆలయాల పాలకమండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

**ఖమ్మంరూరల్:** మండలంలోని రెడ్డిపల్లి గల మారెమ్మతల్లి ఆలయ కమిటీ, తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌ల, సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. పాలక మండలి సభ్యులు తమ పాలనా కాలంలో భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. మారెమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా తిప్పిరెడ్డి వీరారెడ్డి, సభ్యులు కుసుమ రాజారాములు, నాగండ్ల ఉపేంద్ర, బట్టు చలమయ్య, చీకటి శ్రీనివాసరావు, వీర్ల వెంకటేష్, అజ్మీరా వెంకన్న, కందుల అబ్బిరెడ్డి, బాణోత్ స్కర్, బాణోత్. కమలమ్మ, కీర్తి లక్ష్మీనారాయణ, దండి రమలు ప్రమాణ స్వీకారం చేశారు. తీర్థాల ఆలయ కమిటీ చైర్మన్‌గా భూక్యా రావోజీతోపాటు కార్యవర్గ సభ్యులుగా బోజెడ్ల లలితమ్మ, బండారు నాగేశ్వరరావు, మాలోత్ వెంకటేశ్వర్లు, సింగిరెడ్డి బోస్‌రెడ్డి, మద్దెల ఉప్పలయ్య, భూక్యా సేవియాలు ప్రమాణ స్వీకారం చేశారు.

## స్వశక్తితో ఆర్థిక స్వావలంబన

**నేలకొండపల్లి:** ప్రతి ఒక్కరూ స్వశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించాలని కాంగ్రెస్ నాయకులు, మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని అనాసాగారంలో మహబూబు జాన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాటు కోళ్లఫాం కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, చిలకబత్తిని వీరబాబు, నాగేశ్వరరావు, రమేష్, కోడాలి గోవిందరావు, బ్రహ్మం, నరేష్, వెంకటేష్, కొమ్మూరి నరేష్, రహీమ్‌తుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం బార్ సభ్యులకు సన్మానం



బార్ సభ్యులతో ఎంపీ వద్దిరాజు

**ఖమ్మంలీగల్:** ఎంపీ వద్దిరాజు రవిచంద్రను నూతనంగా ఎన్నికైన ఖమ్మం బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మేకల నవీన్, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ కేవీవీ.లక్ష్మి శుక్రవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎంపీ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆకుల గాంధీ, అడ్వకేట్ గుండ్లపల్లి శేషగిరి ఉన్నారు.

## రేపు 'కవియాత్ర'

**ఖమ్మంగాంధీచౌక్:** సమాజ చైతన్యం, రుగ్మతలు, మూఢనమ్మకాలను రూపుమాపటం లక్ష్యంగా ఆదివారం ఉదయం 9 గంటలకు ఖమ్మం ఖిల్లా నుంచి నేలకొండపల్లి మండలం బౌద్ధరామం వరకు కవియాత్ర నిర్వహిస్తున్నట్టు వికాస వేదిక సాహిత్య సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సాధనాల వెంకటస్వామి నాయుడు, లెనిన్ శ్రీనివాస్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వందమంది కవులతో నిర్వహించే ఈ యాత్రలో ఆరు కూడళ్లలో కవి సమ్మేళనాలు, ప్రముఖుల సందేశాలు, పుస్తకాలు, ప్రజా చైతన్య పాటల సీడీల ఆవిష్కరణ ఉంటాయని పేర్కొన్నారు.

## బోర్డుల ఏర్పాటుకు 25న వేలం

**ఖమ్మంగాంధీచౌక్:** ఖమ్మం నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌పై బోర్డుల ఏర్పాటుకు ఈ నెల 25న ఉదయం 11 గంటలకు దేవస్థానం ఆవరణలో బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి చందూరు రామకోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాల పరిమితితో బోర్డుల ఏర్పాటుకు కిరాయి వేలం ఉంటుందని తెలిపారు.

## ఉచిత కరెంట్‌తో ఆర్థిక సమస్యలు

**ఖమ్మంఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత కరెంట్‌తో డిస్కాం పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ బిల్‌కలెక్టర్లు తీవ్ర ఆర్థికసమస్యలు ఎదుర్కొంటున్నారని బిల్‌కలెక్టర్ల యూనియన్ నాయకులు బలగాని వెంకటేశ్వర్లు, జానిమియాలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని రోటరీనగర్ విద్యుత్ బిల్లుల కలెక్షన్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఉచిత కరెంట్ పథకం పేదలకు ఎంతో ఉపయోగకరంగానే ఉందని కానీ కమీషన్ల పద్ధతిలో పనిచేస్తున్న వారికి ఉచితంతో కమీషన్లు రాక, నెలల తరబడి సేవలు అందిస్తున్నప్పటికీ సరైన జీతాలు లభించక జీవితాలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి తమ లాంటి కమీషన్లపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలను రోడ్డున పడకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన నాయకులు



వినతిపత్రం అందించి మాట్లాడుతున్న ముస్తఫా

**ఖమ్మంవన్‌టౌన్:** కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ముస్తఫా శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. బీఆర్ఎస్ హయాంలో తనపై పీడీ యాక్ట్‌తో పాటు అనేక కేసులు బనాయించి జైలుకు పంపారని, పార్టీకి చేసిన సేవలను గుర్తించి నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరారు. అలాగే, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ కూడా మీనాక్షి నటరాజన్‌ను కలిశారు.

# వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి




నేలకొండపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, నాయకులు



కూసుమంచిలో..

**ఖమ్మంమయూరిసెంటర్:** వక్ఫ్ చట్ట సవరణను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. శుక్రవారం మస్జిద్ ఎ వాహిదియ, కుల్ఫాయే రాషిదీన్ సంయుక్త ర్యాలీ నిర్వహించి ఎన్ఎస్‌టీ రోడ్డులో మానవహారం ఏర్పాటు చేశారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి గౌస్, ముఫ్తీ అమీర్హంజా, ఎస్‌కె. రసూల్, హుస్సేన్, రహమాన్, మహబూబ్ అలీ, ముజాహిద్, జావిద్, మూబీన్ ఉన్నారు.



ఖమ్మంమయూరిసెంటర్: మాట్లాడుతున్న మహమ్మద్ సలాం

**ఖమ్మం మామిళ్లగూడెం:** వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్, తెలంగాణ స్టేట్ కో ఆర్డినేటర్ షేక్ అబ్దుల్ రహిమాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తుమ్మలగడ్డ ప్రాంతంలో ముస్లింలు నల్లబాడ్జీలతో నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున రహదారి ఇరువైపులా మానవహారం నిర్వహించారు. అదేవిధంగా ఖమ్మం మమతా రోడ్ మధురా నగర్ ప్రాంతంలో మస్జిద్ ఎ ఆయేషా ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీతోపాటు దువా చేశారు. సయ్యద్ ఖదీర్, హిదాయతుల్లా సాహెబ్, ముఫ్తీ తాహేర్, తౌసిఫ్, మహమ్మద్ రహిముద్దీన్, జానిపాషా, అర్షద్ , హుస్సేన్, వసీం, షాబుద్దీన్, హాబీబ్, మొయినుద్దీన్, సలీం పాషా, ఇమామ్ అలీ ఉన్నారు.



ఖమ్మం మామిళ్లగూడెం: రోటరీనగర్‌లో..

**కూసుమంచి:** వక్ఫ్ చట్ట సవరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కూసుమంచిలోని బస్టాండ్ సెంటర్‌లో ముస్లింలు నిరసన చేపట్టారు. ఇబ్రహీం, అక్రమ్, రహీం, బొజ్జ మియా, మీరాసాహెబ్, జహంగీర్ షరీఫ్, జబ్బార్, ఆలీ, బాబు, రఫీ, హుస్సేన్ పాల్గొన్నారు.

**నేలకొండపల్లి:** వక్ఫ్ బోర్డు సవరణను వ్యతిరేకిస్తూ ముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, వెంకన్న, గుడవర్తి నాగేశ్వరరావు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, కడియాల నరేష్, వాజీద్, షేక్ ఖాసిం సాహెబ్, ఖాజామియా, అబ్దుల్, ఖాసిం, హుస్సేన్, మదార్‌సాహెబ్ ఉన్నారు.



కామేపల్లి: ముచ్చర్లలో..

**కామేపల్లి:** మండలంలోని కామేపల్లి, ముచ్చర్లలో మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండీ.జాకీర్, షేక్ ఇబ్రహీం, ఎండీ.నబీ ఆధ్వర్యాన ముస్లింలు నిరసన తెలిపారు.